ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# సమ్మెట ఉమాదేవి 'రేల పూలు' కథలు – తండావాసుల జీవన ప్రతిబింబాలు

**Dr. Balaram Katchalla**

Principal, Vijetha College of Education,Singarayakonda, Prakasham Dt, Andhrapradesh -523104

Ph.No:9705250027

E Mail Id: balaram.katchalla@gmail.com

Article Received: 15/02/2026

Article Accepted: 28/03/2026

Published Online: 30/03/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.128

**వ్యాస సంగ్రహం:**

ఉమాదేవి రచించిన కథల్లో ఎక్కువగా అమ్మ ఉంటుంది. అలాగే ఎక్కువుగా స్త్రీ పాత్రలే ప్రధాన పాత్రలుగా ఉంటాయి. ఆమె రాసిన ప్రతి అక్షరం స్త్రీల పక్షంగానే ఉంటుంది. ఆమె రాసిన కథల్లో ఎక్కువగా బురదలో నుంచి విరిసిన కమలంలా తమ సమస్యలను తామే ఒంటరిగా పోరాడి పరిష్కరించుకున్న మహిళలే కాకుండా, పల్లె మహిళల కష్టాలు, తండా స్త్రీల కన్నీళ్లు కూడా కనిపిస్తాయి. సమాజంలో మూలాల్లోకి వెళ్లి ముఖ్యంగా గిరిజన తండాల్లోకి వెళ్లి వారిని దగ్గరగా చూసి, వారి జీవితాన్ని కథలుగా రాసిన వారు చాలా తక్కువ మంది ఉంటారు. ఆ రచయితల మాదిరిగానే ఉమాదేవి కూడా ఉద్యోగ రీత్య ఎలాంటి కనీస వసతులు లేని మారుమూల గిరిజన ప్రాంతాలలోనే గడపడానికి అవకాశంగా భావిస్తూ, వారితో మమేకమై, ఆ జీవితాలను మిగిలిన సమాజాలకు పరిచయం చేయాలని ఎంతో పరితపించేవారు. ఆ విధంగానే సమాజమూలాల్లోకి వెళ్లి అక్కడ వారి బ్రతుకులు వెతల్ని అభ్యుదయ దృక్పథంతో రాస్తూ, మారుమూల సమాజ జీవితాలను మన కళ్ళ ముందు ఆవిష్కరిస్తూ, సాహితీ లోకానికి తన రచనలను అందించారు రచయిత్రి ఉమాదేవి.

**కీలక అంశాలు: తండా వాసుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, అనాగరిక విధానాలు..**

## 1. పరిచయం:

తెలుగు కథా సాహిత్యంలో ప్రతినిత్యం కొత్త వాయువులు వేస్తూనే ఉన్నాయి. సుమారు 1980 నుండి వస్తున్న కథా సాహిత్యాన్ని కొత్తతరం కథకుల కథల్ని సమకాలీన కథా సాహిత్యంగాగానీ,

అత్యాధునిక కథగా గాని పేర్కొనవచ్చు. వేణిగుట్టు తరం కథ రచయితల కన్నా భిన్నమైన ఇతివృత్తంతో విలక్షణమైన శైలితో ఈ తరం రచయితలు తమ ప్రాంతపు సాంఘిక జీవనానికి మాత్రమే కాకుండా ప్రాంతీయ భాషకి (మాండలిక భాషకి) కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. అదేవిధంగా సమాజంలో ఉన్న సమస్యలను ఎత్తు చూపడమే కాకుండా మూఢవిశ్వాసాలను దురాచారాలను నిర్మూలించడానికి కావలసిన మార్పులని ఆవిష్కరిస్తూ తమ బలమైన రచనలతో వెలుగులోకి వస్తున్నారు. అటువంటి రచయితలలో అభ్యుదయ రచయితగా ప్రసిద్ధ చెందిన రచయిత్రిగా పేరు సంపాదించుకున్న వారు శ్రీమతి సమ్మెట ఉమాదేవి.

**2. 'రేల పూలు' కథాసంపుటి - తండావాసుల జీవనం :**

ఈ కథా సంపుటిలో 16 కథలున్నాయి.అవి-1. అస్థిత్వం 2. బిజిలి 3. చాంది 4. దివిలి 5. జైజై జై గణేశా 6. కేస్లా 7. ఓ పాలబుగ్గలా చిన్ని రైతా 8. తావుర్యా 9. వాన 10. గిరి కాన దీపం 11. చీనా 12. అల్యా 13. ఆశలు 14. హథీరామ్ 15. అమ్రు 16. వారధి. ఈ కథలన్నీ తండావాసుల జీవితాలకు అద్దం పడతాయి.

**2.1.తండా ప్రజల పండగలు :**

'అస్థిత్వం' కథలో పూర్వకాలం నుండి వివిధ తెగలు, జాతులు ఆనంద సమయాలలో చుట్టుపక్కల వారితో కలిసి మరింత ఆనందంగా ఉండటానికి, ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి పండుగలను ఏర్పరచుకున్నారు. వివిధ ప్రాంతాలలో ఈ పండుగల విధానం, ఆచారాలు మారిపోతూ ఉంటాయి. ఆయా కాలాలకు అనుగుణంగా ప్రజలు పండుగలు జరుపుకుంటారు. తండా ప్రజలు జరుపుకునే పండగలైన తీజ్ పండుగ, బారాంద్ కాయినే అనే వనభోజనాల భోజనాల పండుగల గురించి, వాటి విధివిధానాల గురించి రచయిత్రి ఈ కథలో తెలియజేశారు.

**2.2.తండావాసుల కరెంటు కష్టాలు:**

'బిజిలి' కథలో కొండ ప్రాంతాలలో, అడవి ప్రాంతాలలో బతికే చిన్న జీవితాలు తండావాసులవి. ప్రభుత్వాలు వీరికి అందించవలసిన కనీస అవసరాలను కూడా అందించవు. కరెంటు సదుపాయం లేకపోవడంతో ఆ అడవి ప్రాంతలలో గిరిజనులు పాముకాట్లకు చనిపోవడం, చదువుకోలేకపోవడం వంటి సమస్యలను రచయిత్రి ఈ 'బిజిలి' అనే కథలో ప్రస్తావించారు. భూస్వాముల పొలాలకు నీటి సదుపాయాలకు కరెంటు లైన్స్ ఏర్పాటు చేసే ప్రభుత్వాలు వందల మంది ఉండే తండాలను మాత్రం శీతకన్నుతో చూడడాన్ని రచయిత్రి ఈ కథలో దుయ్యబడతారు.

**2.3.తండావాసుల వివాహాలు :**

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

'చాంది' కథలో తండా ప్రజలలో రెండవ పెళ్లి సర్వసాధారణమైన విషయం. మగవారికి కూతురు వయసున్న ఆడపిల్లలను చేసుకోవడం ముచ్చట. ఆ ముచ్చట వల్ల ఆడపిల్లల జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో రచయిత్రి ఈ కథలో తెలియజేశారు. బాధ్యతలు తీసుకోవడం, పోషించడం తెలియకపోయినా మగవారు రెండవ పెళ్ళికి సిద్ధమయ్యి ఆడపిల్లల గొంతు కోయడమనే దారుణాన్ని రచయిత్రి ప్రస్తావించి, ఆ దారుణం నుండి తమను తాము ఎలా కాపాడుకోవాలి అన్న విషయాన్ని చాంది పాత్ర ద్వారా ఈ కథలో తెలియజేశారు.

**2.4. తండాలలో మత ప్రచారాలు:**

'దివిలి' కథలో నిమ్న తరగతి ప్రజలలో మత ప్రచారం ఏ విధంగా జరిగిందో రచయిత్రి ఈ కథలో చక్కగా చిత్రించారు. దుప్పట్లు పంచి, చీరలు పంచి, భోజనాలు ఏర్పాటు చేసి తమ మతంలోనికి లాక్కొని స్త్రీల మీద అఘాయిత్యం చేసే దొంగ భక్తుల నైజాన్ని తెలిపారు. అభం శుభం తెలియని అమాయక స్త్రీలు మత ప్రచారం ముసుగులో కామ వాంఛలు తీర్చుకునే వారి చేతిలో బలైపోయే విషయాలు ధైర్యంగా ఈ 'దివిలి' అనే కథలో అక్షరీకరించారు రచయిత్రి.

**2.5. మానవత్వం:**

'జైజై జై గణేశా' కథలో వినాయక చవితి కోసం వసూలు చేసిన డబ్బులు రజనికి వైద్యం చేయించినందుకు ఊరివాళ్లు ఏమంటారో అని యువకులు కంగారు పడిపోతుంటే, తండా ప్రజలు మాత్రం "రజనక్కకు ఎట్లుంది బిడ్డా? గణేశుని కోసం ల వసూల్ జేసిన పైసల్ ఖర్సయితే అయినయి. మీరేం రంధ్రి పడకుండ్రి. రజనమ్మ బతికింది గదే సాలు" అంటారు. ఈ ఒక్క మాటతో తండా ప్రజలలో ఉండే మానవత్వాన్ని రచయిత్రి పాఠకలోకానికి తెలియజేశారు. అదేవిధంగా దేవుని కోసం ఖర్చు చేసే బదులు అవసరంలో ఉన్న వారిని ఆదుకోమనే సందేశాన్ని కూడా రచయిత్రి ఈ కథ ద్వారా అందించారు.

**2.6. సంఘ సంస్కరణ :**

'కేస్లా' కథలో అమాయకత్వం, మూఢత్వం నిండి ఉండే సమాజాన్ని మార్చడానికి ఎన్నో ఆటు పోట్లుకు గురికావాల్సి వస్తుంది. ఎవరి కోసం పాటుపడుతూ కష్టపడుతున్నామో వారే అర్థం చేసుకోకుండా శిక్షించడం జరుగుతుంది. అయినా సరే నిజమైన సంఘసంస్కర్త ఆ విషయాన్ని పట్టించుకోకుండా నిరంతరం సంఘం కోసం పాటుపడుతూనే ఉంటాడని రచయిత్రి ఈ కథలో తెలుపుతారు. గిరిజన తండాలలో

మూఢనమ్మకాలు మనుషులను ఎంతగా ప్రభావితం చేస్తాయోనన్న విషయాన్ని కూడా రచయిత్రి ఈ కథలో చిత్రించారు.

**2.7. తండా పిల్లల చదువులు :**

'ఓ పాలబుగ్గలా చిన్ని రైతా' కథలో ఈ కథలో తండాలోని పిల్లల చదువుల గురించి ప్రస్తావించారు రచయిత్రి. తండాలోని వాళ్లకు ఉన్న కొద్దిగో గొప్పో భూమిలో పంట పండించడం కోసం పని వాళ్ళను పెట్టుకునే స్తోమత వాళ్లకు ఉండదు. కాబట్టి ఇంటిల్లిపాది పిల్లాజెల్లా కలిసి పని చేసుకోవాల్సివస్తుంది. ఈ పరిస్థితి కారణంగా పిల్లలు చదువుకోవాలనే కోరిక వున్నా, మంచిగా చదవగలిగిన సామర్థ్యం వున్నా చదువుకు దూరమయ్యిపోతున్నారన్న విషయాన్ని రచయిత్రి కళ్ళకు కట్టినట్లుగా, మనసుకు హత్తుకునేటట్లుగా చిత్రించారు.

**2.8. సన్నకారు రైతుల వెతలు:**

'తావుర్యా' కథలో ఊర్లకు దగ్గరలో ఉండే తండాలలోని సన్నకారు రైతులను ఆయా ఊర్లలో ఉండే దొరలు, సర్పంచులు, పోలీసులు రుబాబుగా దోచుకోవడాన్ని, వారిని ప్రశ్నించలేని రైతుల ఆశక్తతను రచయిత్రి 'తావుర్యా' అనే కథలో అద్భుతంగా చిత్రించారు. అవసరానికి సాయం చేస్తున్నట్లే ఉండి ప్రజలను హింసించే ధనిక వర్గాల నైజాన్ని రచయిత్రి ఈ కథలో విశదీకరించారు.

**2.9. తండా ప్రజలలో మానవత్వం:**

'వాన' కథలో తండా ప్రజలలో కులం కట్టుబాట్లు, ఆచారాలు కొంచెం జాస్తి. కట్టుబాట్లను ఎవరైనా తప్పినట్లయితే వారికి తప్పు కింద జరిమానా విధించడమో, పెద్ద తప్పే అయితే తండా నుండి వెలివేయడమో జరుగుతుంది. కాని అంత కట్టుబాట్లలతో ఉండే తండాలో కట్టుబాట్లా? మానవత్వమా? అనే ప్రశ్న తలెత్తినప్పుడు మానవత్వం వైపే తండా ప్రజలు మొగ్గుచూపడాన్ని రచయిత్రి ఈ 'వాన' అనే కథలో తెలియజేశారు.

**2.10. సంఘు బాధ్యత :**

'గిరి కాన దీపం' కథలో తండా ప్రజలు ఊరికి దూరంగా, సదుపాయాలకు దూరంగా, విద్యకు, వైద్యానికి దూరంగా బతికే అమాయక ప్రజలు. వారి అభివృద్ధి కోసం ఏ రాజకీయనాయకుడు రాడు. కాబట్టి వాళ్ల బాగు కోసం వారిలోనే చైతన్యం ప్రారంభం కావాలని రచయిత్రి అభిప్రాయపడ్డారు. అంతో ఎంతో చదువుకుని ఉద్యోగాలలో ఉండేవాళ్లు తండాలోని మనుషుల కోసం చేతనైన సాయం చేయాలని రచయిత్రి తన సందేశంగా ఈ 'గిరి కాన దీపం' అనే కథను రచించారు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

**2.11. తండాలో మానవసంబంధాలు :**

'చినా' కథలో కథలో తండా ప్రజలు రక్తసంబంధాలకు, మానవసంబంధాలకు ఎక్కువ విలువనిస్తారు. బలగమే బలంగా బతుకుతారు. చెల్లెలు పిల్లలు కానీ అనాథలైతే, వారిని దిక్కులేని పిల్లలుగా వదిలేయరు. దగ్గరకి తీసి వారి సంరక్షణ బాధ్యతలు తీసుకుంటారు. భార్యాభర్తల మధ్య బంధం కూడా అన్యోన్యానురాగాలతో విలసిల్లుతుంటది. మానవ సంబంధాలకు చిరునామాలు తండాలు అని రచయిత్రి 'చినా' కథలో తెలియజేశారు.

**2.12. తండా ప్రజలు-ప్రేమ:**

'అల్యా' కథలో కథలో తండాలలో ప్రజలు ప్రేమించే హక్కును కలిగి ఉంటారు. పిల్లల ప్రేమకు పెద్దలు అభ్యంతరాలు చెప్పరు. ఒకరినొకరు ఇష్టపడితే పెళ్లి చేస్తారు. ఆ విషయంలో పిల్లలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తారు పెద్దలు. కోరుకున్న వాళ్లని, ప్రేమించిన వాళ్ళనే చేసుకోవడం వలన వారి సాంసారిక జీవితాలు మిగిలిన వారి కంటే మెరుగ్గా ఉంటాయి. ప్రేమ, పెళ్లి విషయాలలో తండా ప్రజలు పరువు హత్యలకు పాల్పడే అగ్రవర్ణాలకు ఆదర్శం అని రచయిత్రి 'అల్యా' కథ ద్వారా చెప్పక చెబుతారు.

**2.13. తండావాసుల చిరు ఆశలు:**

'ఆశలు' కథలో దోపిడీదారుల్లాగా, భూస్వాముల్లాగా పెద్ద కోరికలేవి ఉండవు తండా ప్రజలకు. మంచి బట్ట కట్టుకోవాలని, సమయానికి తిండి దొరకాలని, చెప్పులు వేసుకోవాలని ఇలా చిన్న చిన్న కోరికలతో ఉండే తండా ప్రజలను నాసిరకం వస్తువులతో మభ్యపెట్టి వారిని మోసం చేసే వ్యాపారస్తుల పన్నాగాలను, ఆ పన్నాగాలకు లొంగిపోయే తండాలలోని ప్రజల అమాయకత్వాన్ని రచయిత్రి 'ఆశలు' అనే కథలో చిత్రించారు.

**2.14. వన్యప్రాణి సంరక్షణ :**

'హథీరామ్' కథలో సాధారణంగా అడవుల్లో ఉండే తండా ప్రజలు అడవిలోని ప్రతి చెట్టును, జీవిని గౌరవిస్తారు, కాపాడుకుంటారు. సాటి మనిషినే మనిషిగా చూడని నాగరీకులకంటే నోరులేని జీవాల కోసం తాపత్రయపడే తండా ప్రజలను కల్మషం లేని హృదయం కలిగిన ప్రకృతి ప్రేమికులుగా రచయిత్రి 'హథీరామ్' కథలో చిత్రించారు.

**2.15. స్త్రీ చైతన్యం :**

'అమ్రు' అనే కథలో స్త్రీ చైతన్యాన్ని రచయిత్రి చక్కగా వివరించారు. ఏ మగదిక్కు లేకపోయినా స్త్రీ తన కాళ్ళ మీద తాను నిలబడి గౌరవంగా బతకడంలో ఉన్న స్వాభిమానాన్ని, స్వావలంబనను గొప్పగా

చిత్రించారు. స్త్రీకి ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక చైతన్యం తప్పనిసరిగా అవసరం అని, ప్రతి మహిళ కూడా సామాజిక చైతన్యాన్ని కలిగి తమను తాము కాపాడుకుంటూ, తోటి దీనులను కూడా కాపాడగల సామర్థ్యాన్ని సాధించాలని రచయిత్రి 'అమ్ము' కథలో తెలియజేశారు.

**3. ముగింపు:**

ఊరికి దూరంగా అడవుల్లో ఉండే తండాలలో కనీస సదుపాయాలు కూడా ఉండని పరిస్థితిని రచయిత్రి 'వారధి' అనే కథలో చిత్రించారు. వాహన సదుపాయం లేని కారణంగా అత్యవసరంగా అందవలసిన వైద్యం అందక ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం, ఏ నేరమూ చేయని తండా ప్రజలను తప్పుడు కేసులలో పోలీసులు అరెస్టు చేయడం లాంటి దుర్మార్గాలను కూడా రచయిత్రి ఈ కథలో ప్రస్తావించారు. ప్రజల కోసం విప్లవ మార్గం పట్టిన వాళ్లే దారితప్పి ప్రజలకు ఇబ్బందులు కల్గించారనే చేదు నిజాన్ని రచయిత్రి నిర్భయంగా తెలియజేశారు.

**4. ఆధార గ్రంథాలు :**

1. 'కథానిక స్వరూప స్వభావాలు', - దక్షిణామూర్తి పోరంకి,
2. జమ్మి పూలు - సమ్మెట ఉమాదేవి
3. రేల పూలు - సమ్మెట ఉమాదేవి
4. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న
5. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న
6. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య
7. 'కథలెలారాస్తారు' - నాగేశ్వరరావు తాళ్ళూరు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2005
8. 'విశ్వసాహితి'(తెలుగు విజ్ఞానసర్వస్వం)- కుటుంబరాయశర్మ బడ్డపాటి, తెలుగు భాషాసమితి, మద్రాసు.